06072024-MAI-04_Layout 1 7/6/2024 4:27 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

తెలంగాణపై పట్టు కోసమే బాబు ఎత్తులు

తోటకూర రమేశ్

ఎన్డీయే కూటమిలో కీలకంగా ఉంటూ, కేంద్ర ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఏకంగా ప్రత్యేక హోదా డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. ప్రత్యేక సమావేశం పెట్టి మరీ తమ డిమాండ్ సెగ ఢిల్లీకి తగిలేలా జేడీయూ పార్టీ తరపున తీర్మానం చేసి ప్రధాని మోదీకి పంపించారు. అదే ఎన్డీయే కూటమిలో కీలకంగా ఉన్న చంద్రబాబు మాత్రం ఏపీ విషయంలో ఎలాంటి డిమాండ్లు ముందుకు తేవడం లేదు. జేడీయూ తరహాలో ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని మోదీపై ఒత్తిడి తీసుకురావడం లేదు. అందుకు బదులుగా కేవలం తెలంగాణలోని అభివృద్ధిని అడ్డుకునేలా కుట్రలు చేస్తున్నారు.

సీఎంల భేటీ రాజకీయం- 2

తెలంగాణపై ఆధిపత్యం సాధిస్తే ఇక్కడి నుంచి వ్యాపారాలను ఏపీకి తరలించుకుపోవచ్చని, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని గుప్పిట్లో పెట్టుకుని ఆట ఆడిస్తూ పెట్టుబడులు ఏపీకి మళ్లించవచ్చనేది చంద్రబాబు ఆలోచన. హైదరాబాద్ సహా తెలంగాణలో భారీ నిర్మాణాలకు అనుమతి ఇవ్వకుండా సీఎం రేవంత్ రెడ్డిపై పరోక్షంగా ఒత్తిడి తీసుకువస్తే ఆటోమేటిక్‌గా వారు ఏపీ వైపు చూస్తారు. అంతేకాదు, తెలంగాణలో కంటే తమ రాష్ట్రంలో ఎక్కువ రాయితీ ఇస్తామని వరాలజల్లు కురిపిస్తే.. ఇక్కడి నుంచి కంపెనీలు ఏపీకి క్యూ కడతాయనేది చంద్రబాబు వ్యూహం. ఈ క్రమంలో విభజన చట్టంలో ఉన్న అపరిష్కృత సమస్యలపై చర్చించేందుకు కలుద్దామంటూ తెలంగాణలో చంద్రబాబు నక్కజిత్తులు వేస్తున్నారు.

కేంద్రంలో తనకున్న పలుకుబడితో చంద్రబాబు చేస్తున్న శకుని రాజకీయాల వల్ల తెలంగాణకు అన్యాయం జరిగే అవకాశాలు దండిగా ఉన్నాయి. చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి తెలంగాణ సీఎంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సహకరించే అవకాశాలు తక్కువే కనిపిస్తున్నాయి. అయితే గియితే కేంద్ర నిధుల విషయంలో తెలంగాణకు అన్యాయం చేస్తారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావాల్సిన నిధులను ఏపీకి తరలించే కుట్రలు కనిపిస్తున్నాయి. అంతేకాదు, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారంలో కేంద్రం నిర్ణయాలు కూడా ఏకపక్షంగా ఉండవచ్చు. విద్యుత్తు ఆస్తుల పంపకం, కృష్ణా, గోదావరి నదుల నీటి వాటాల విషయంలో తెలంగాణకు వ్యతిరేకంగా, ఏపీకి అనుకూలంగా నిర్ణయాలు వచ్చేలా చంద్రబాబు చేయవచ్చు. 'ప్రభుత్వాన్ని పడగొడుతా' అని బ్లాక్‌మెయిల్ చేసి కేంద్ర క్యాబినెట్‌లో తీర్మానాలు కూడా చేయించవచ్చు. ట్రిబ్యునల్స్ ఉన్నా, న్యాయస్థానాలు ఉన్నా వాటిల్లో అసలు సంగతి తేలేలోపు తెలంగాణ ప్రజలకు అన్యాయం జరగవచ్చు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చే నిధులు మొదలుకుని బడ్జెట్‌లో కేటాయింపుల వరకూ.. రాష్ట్రాల అంతర్గత సమస్యల నుంచి రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదాలూ, ప్రాజెక్టుల నీటి పంపకాల వరకు అనేక అంశాల్లో బాబు పాత్ర కచ్చితంగా ఉంటుంది. ఆయన లోపల్లోపల పలుకుబడి ఉపయోగించి తన రాష్ట్రానికి మేలు కలిగేలా చేసుకోవచ్చు. మరోవైపు తెలంగాణకు కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందాలన్నా, ఎక్కువ మొత్తంలో నిధులు రావాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వం చంద్రబాబుపై ఆధారపడాల్సి వస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి కూడా కేంద్రంతో తీవ్రంగా కొట్లాడకపోవచ్చు. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వంలో చక్రం తిప్పుతున్నది ఆయన గురువే కాబట్టి.

అంతేకాదు, కేంద్రంపై తీవ్రమైన విమర్శలు కూడా చేసే అవకాశాలు లేవు. ఒకవేళ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గట్టిగా కొట్లాడే ప్రయత్నం చేస్తే.. బీజేపీ వెంటనే చంద్రబాబును రంగంలోకి దించి రేవంత్ రెడ్డి దూకుడుకు చెక్ పెట్టవచ్చు. తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు మోదీ గుజరాత్‌కు తరలించారని రేవంత్ రెడ్డి విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. రేపు హైదరాబాద్‌కు వచ్చే కంపెనీలను కేంద్రంలో పలుకుబడిని ఉపయోగించి చంద్రబాబు తన రాష్ట్రానికి తరలించుకు పోతే రేవంత్ రెడ్డి అదే తరహాలో తన గురువును విమర్శించకపోవచ్చు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని కాంగ్రెస్.. టీడీపీతో కలిసి రహస్యంగా పనిచేసినా ఆశ్చర్యం లేదు. కేంద్రానికి చంద్రబాబు అనేక సంస్కరణలను ప్రతిపాదించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అమలు చేస్తేనే నిధులు ఇస్తామని షరతు కూడా పెట్టవచ్చు. అలా అయితే ఇప్పుడు తక్షణం తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కారుకు పొంచి ఉన్న ప్రమాదం ఏమిటంటే.. బీజేపీ తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణలు అమలు చేయడంతో పాటు వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టడమే. అలా మీటర్లు పెడితేనే కేంద్రం నుంచి నిధులు విడుదల చేస్తామని చెప్పవచ్చు. ఏదేమైనా తెలంగాణ ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరం.

ఇంకోవైపు హైదరాబాద్‌పై కూడా ఎన్డీయే కూటమి కుట్రలు చేసినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. జూన్ 2 నుంచి తెలంగాణ పూర్తిస్థాయి రాజధానిగా హైదరాబాద్ మారిపోయింది. హైదరాబాద్‌ను మరింత కాలం ఉమ్మడి రాజధానిగా చేయాలన్న డిమాండ్ ఏపీలో కొంతమంది రాజకీయ నాయకుల నుంచి వస్తున్నది. అంతేకాదు, ఒకడుగు ముందుకేసి హైదరాబాద్‌ను యూటీ చేయాలి లేదా దేశ రెండో రాజధానిగా చేయాలన్న డిమాండ్ కూడా వస్తున్నది. హైదరాబాద్‌ను యూటీ చేసినా తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని కాంగ్రెస్ సీనియర్ నేతలు గతంలోనే చెప్పుకొచ్చారు. చంద్రబాబు నాయుడు చొరవతో యూటీ లేదా ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను చేసే దిశగా కుట్రలకు తెరతీసే అవకాశాలు చాలానే ఉన్నాయి.

మరోవైపు తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టయ్యింది. తెలంగాణకు కేంద్రం నుంచి అంతంతమాత్రం సహకారమే ఉంటున్నది. చట్టబద్ధంగా రావాల్సిన నిధులపై కూడా నీలినీడలే కమ్ముకున్నాయి. టీడీపీలాగా పార్లమెంట్‌లో తెలంగాణ గళాన్ని గట్టిగా వినిపించే పరిస్థితి లేదు. దీంతో వచ్చే ఐదేండ్లు తెలంగాణ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిగా మారనుంది. అయితే విభజన చట్టంలో ఉన్న తెలంగాణ హక్కులపై ఇదివరకటి సీఎం కేసీఆర్‌లాగా.. చంద్రబాబుతో రేవంత్ రెడ్డి ఢీ అంటే ఢీ అన్నట్లు కొట్లాడేందుకు ఆస్కారం లేదు. చంద్రబాబును రాజకీయంగా ఢీ కొట్టే సత్తా రేవంత్ రెడ్డికి లేదు. రేవంత్ రెడ్డికి నిజంగా తెలంగాణపై ప్రేమ ఉంటే చంద్రబాబు కుట్రపూరితంగా ఏపీలో కలుపుకొన్న ఏడు మండలాలను తిరిగి ఇచ్చేలా ఒప్పించాలి. విభజన చట్టంలో తెలంగాణకు కేటాయించిన లోయర్ సీలేరు విద్యుత్తును మనకు ఇవ్వకుండా చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే కుట్రపూరితంగా అడ్డుకున్నారు. ఇప్పుడు చంద్రబాబుతో భేటీలో సీలేరు విద్యుత్ తెలంగాణకు వచ్చేలా రేవంత్‌రెడ్డి ఒత్తిడి తీసుకురావాలి.

> ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశంలో ఓటు నోటు కేసు ప్రత్యేకంగా చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణలో రేవంత్ రెడ్డికి, ఏపీలో కేంద్రంలో చంద్రబాబుకు ఓటు నోటు కేసు ఒక రాజకీయ గుదిబండగా మారింది. ఈ కేసు విచారణ న్యాయస్థానంలో ఉండటంతో దాని నుంచి ఏలా తప్పించుకోవాలన్న దానిపై రేవంత్ రెడ్డి, చంద్రబాబు మధ్య రహస్య చర్చ జరగవచ్చు. కేంద్ర ప్రభుత్వంలో చంద్రబాబు కీలకపాత్ర పోషిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు, విచారణ సంస్థలకు బలమైన సాక్ష్యాలు అందిస్తే ఇద్దరికీ శిక్ష పడే ప్రమాదం ఉంది. అందుకే సాక్షులను, విచారణను ప్రభావితం చేసేందుకు ఉమ్మడిగా వ్యూహాలు రచించవచ్చు.

తెలంగాణలో లోకల్ బాడీ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందని చంద్రబాబు చెప్పారు. కొండగట్టు పర్యటనలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏపీలో మాదిరిగానే తెలంగాణలో జనసేన-బీజేపీ కలిపి పోటీ చేస్తాయని చెప్పారు. అయితే అటు చంద్రబాబు వ్యాఖ్యల్లో.. ఇటు పవన్ కామెంట్స్‌లో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి పోటీ చేస్తాయనే విషయం స్పష్టం అవుతున్నది. చంద్రబాబు చెపుతున్నట్టు ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీ బయటకు విభజన హామీల పరిష్కారం కోసమేనని చెప్పినప్పటికీ తెరవెనుక చంద్రబాబు, మోదీ రహస్య రాజకీయ ఎజెండా ఉందన్నది సుస్పష్టం.

ఏదేమైనా తెలంగాణ ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలి. తెలంగాణలో చంద్రబాబు చేస్తున్న కుట్ర రాజకీయాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి. అంతేకాదు, చంద్రబాబుతో కలిసి రేవంత్ రెడ్డి చేసే కుమ్మక్కు రాజకీయాలను ఎప్పటికప్పుడు పసిగడుతూ ఉండాలి. రాజకీయ ఈగోలకు పోకుండా హక్కులపై కలిసి కేంద్రం, ఎన్డీయేలో భాగస్వామ్య పార్టీల మెడలు వంచాలి. రాష్ట్రంలో చంద్రబాబు చేస్తున్న శకుని రాజకీయాలపై తెలంగాణ ప్రజలు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా భవిష్యత్ అంధకారంగా మారుతుంది. మళ్లీ తెలంగాణ సమాజం పరాయి పెత్తనం కింద బానిసలుగా మారే దుస్థితి ఎదురయ్యే ప్రమాదం పొంచి ఉందని మరువరాదు.

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలె!

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని, ఇతర సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బహిరంగ లేఖ

శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారికి,
ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్రం.
విషయం: పంచాయతీరాజ్ శాఖలో నెలకొన్న సమస్యల పరిష్కారం, నిధుల విడుదల గురించి.

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చేందుకు కంకణం కట్టుకున్న తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు గారు పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. అందులో భాగంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి చెత్తాచెదారం, మురుగు కాల్వలను శుభ్రపరచడం, పరిసరాల పరిశుభ్రత, ఎవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ, డంపింగ్ యార్డుల్లో పిచ్చి మొక్కల తొలగింపు, వైకుంఠధామాల నిర్మాణం, వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు నిర్వహించి పల్లెలు, పట్టణాలను అద్దంలాగా మెరిసేలా చేశారు.

కానీ, ఏడు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్యం కుంటుపడింది. గ్రామ పంచాయతీలకు నయా పైసా విడుదల చేయకుండా నిర్వహణను గాలికి వదిలి వేయడంతో కునారిల్లుతున్నాయి. మురికి కూపాలుగా మారుతున్నాయి. చివరకు ట్రాక్టర్లకు డీజిల్ డబ్బులు కూడా ఇవ్వలేని పరిస్థితి. కొన్నిచోట్ల అధికారులు అప్పులు చేసి డీజిల్ పోయిస్తున్నారంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ సహా అనేక ముఖ్యమైన విధుల్లో నిత్యం శ్రమిస్తున్న గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు జీతాలు అందక ఆవేదన వ్యక్తం చేస్తున్నరు. వేతనాలు అందకపోవడంతో దిక్కులేని స్థితిలో పనులు మానేశారు. దీంతో గ్రామాల్లో చెత్త సేకరణ ఆగిపోయింది. ట్రాక్టర్ మూలనపడింది. వీధి దీపాల నిర్వహణ లేదు. తాగునీటి సరఫరా నిర్వహణ మూలనపడింది. ఫాగింగ్ లేదు, చివరకు బ్లీచింగ్ పౌడర్ అందించని దుస్థితి. దీంతో గ్రామాల్లో విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నరు.

> బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా వానాకాలం ప్రారంభంలోనే ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించేది. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కింద పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్‌ల సంగతి పక్కనపెడితే ఉన్న పనులు కూడా చేయడం లేదు. అవసరమైన నిధులు విడుదల చేయడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు నెల నెలా రూ.275 కోట్ల జీపీ నిధులు విడుదల చేశాం. మొత్తంగా ఏటా రూ.3,330 కోట్లు ఇచ్చాం. పట్టణాల పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఏటా అదనంగా రూ.1,700 కోట్లు ఖర్చు చేశాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం 7 నెలల్లో 7 పైసలు కూడా విదిల్చింది లేదు.

ఒక్క పారిశుద్ధ్య కార్మికులకే కాదు. ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు సైతం గౌరవ వేతనాలు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. ప్రతి నెలా ఒకటవ తేదీనే జీతాలు చెల్లిస్తామని గొప్పలు చెప్పుకొన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం భిన్నంగా వ్యవహరిస్తున్నది. చేసిన పనులకు సర్పంచులు గవర్నర్‌ను కలిసి బిల్లులు విడుదల చేయాలని మొరపెట్టుకునే పరిస్థితి కాంగ్రెస్ పాలనలో వచ్చింది. పంచాయతీలు, మున్సిపాలిటీల నిర్వహణ కోసం బీఆర్ఎస్ చేసిన కృషిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించకపోగా, స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నది. ఇప్పటికైనా పాడైపోతున్న గ్రామ పంచాయతీ వ్యవస్థను తిరిగి గాడినపెట్టేందుకు కృషి చేయాలని, అందుకుగాను ఈ ముఖ్యమైన సమస్యలకు తక్షణం పరిష్కారం చూపాలని మిమ్ములను కోరుతున్నాను.

1. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి.
2. పారిశుద్ధ్య కార్మికులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి.
3. చేసిన పనులకు గాను సర్పంచులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి.
4. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు, పట్టణాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి, పారిశుద్ధ్యం పెంపొందించాలి.

టి.హరీశ్‌రావు
మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే

> నేడు దేశాన్ని అతలాకుతలం చేస్తున్న అంశం నీట్. పేపర్ లీకేజీ కారణంగా సుమారు 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో చిక్కుకున్నది. ఇది ఆ విద్యార్థుల సమస్య మాత్రమే కాదు, దేశ భవిష్యత్తుకు సంబంధించిన విషయం.

నీట్‌గా స్కాం చేశారు!

జి. రాజేశ్ నాయక్
96035 79115

మన దేశంలో వైద్య విద్య కళాశాలలు, సీట్లు తక్కువగా ఉండటంతో డాక్టర్ చదువుకు భారీగా డిమాండ్ ఏర్పడింది. ఈ పోటీని తట్టుకోలేక సతమతమవుతున్న విద్యార్థులను పేపర్ లీకేజీ మరింత ఇబ్బందుల్లోకి నెట్టివేసింది. పరీక్ష పేపర్ల లీకులు, పరీక్షా నిర్వహణలో అవకతవకలు మన దేశంలో సర్వసాధారణంగా మారిపోయాయి. నీట్ ఘటన మరువక ముందే నెట్-యూజీ ఉదంతం కలకలం రేపింది. నీట్ పేపర్ లీక్ అయిందని తెలిసినా, అటు ప్రభుత్వం గానీ, ఇటు ఎన్టీయే గానీ సరైన రీతిలో స్పందించకపోవడంతోనే నెట్‌లోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయి.

నీట్ ముగిసిన కొన్ని రోజులకే పేపర్ లీక్ జరిగిందనే అభియోగాలపై 13 మందిని బీహార్ పోలీసులు అరెస్టు చేశారు. ఒక్కో విద్యార్థి నుంచి వారు లక్షల రూపాయలు వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా, గుజరాత్‌లోనూ అరెస్టులు జరిగాయి. దీని వెనుక ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ యజమాని, ఓ ఉపాధ్యాయుడు, ఒక స్థానిక బీజేపీ నేత ప్రమేయం ఉన్నట్టు వార్తలు వచ్చాయి.

మన దేశంలో గత ఐదేండ్లలో 41 పరీక్షల పేపర్లు లీక్ అయ్యినట్టు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పరిశోధనాత్మక కథనం వెలువరించింది. లీకుల కారణంగా లక్షల మంది ఉద్యోగార్థుల జీవితాలు ప్రభావితమైనట్టు ఆ కథనం వెల్లడించింది.

2013లో నీట్‌ను మొదట ప్రతిపాదించినప్పుడు ఉమ్మడి ఏపీ, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ సహా అనేక రాష్ట్రాలు వ్యతిరేకించాయి. అప్పట్లో గుజరాత్ సీఎంగా ఉన్న మోదీ నీట్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ, ప్రధాని అయ్యాక అందుకు భిన్నంగా వ్యవహరించారు. అంతేకాదు, ఆ పరీక్ష నిర్వహణ బాధ్యతలను స్వయంప్రతిపత్తి కలిగిన ఎన్టీయేకు అప్పగించారు. దాంతో పరీక్ష నిర్వహణలో జవాబుదారీతనం పెరుగుతుందని అందరూ భావించారు. కానీ, అందుకు విరుద్ధంగా నేడు దేశంలో పరిణామాలు జరుగుతున్నాయి.

ఈ ఏడాది నీట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నుంచే అవకతవకలు మొదలయ్యాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫిబ్రవరి 9న మొదలైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ మార్చి 9తో ముగిసింది. ఆ తర్వాత వారం పాటు గడువు పొడిగించింది. అయితే గడువు ముగిసిన నెల రోజుల తర్వాత ఏప్రిల్ 9న రిజిస్ట్రేషన్లను మళ్లీ తెరవడమూ అనుమానాలకు తావిస్తున్నది. ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తూ ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఏకంగా 67 మంది టాపర్లుగా నిలిచారు. పైగా ఎక్కువ మంది 720 మార్కులు ఎందుకు సాధించారనే ప్రశ్నకు ఎన్టీయే చెప్తున్న సమాధానం హాస్యాస్పదంగా ఉన్నది. అవకతవకలను గుర్తించిన ఎన్టీయే నీట్ ఫలితాలను 10 రోజుల ముందుగానే విడుదల చేసిందనే అనుమానాలు ఉన్నాయి. ఎన్నికల ఫలితాల హడావుడిలో ఈ స్కామ్‌ను కప్పిపుచ్చాలనే వ్యూహంతోనే ఎన్టీయే ఆ రోజు నీట్ ఫలితాలను విడుదల చేసింది.

జాతీయ అర్హత పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ అనేది చిన్న విషయం కాదు. ఇది మన దేశ భవిష్యత్తుకు సంబంధించిన విషయం. విద్యార్థులు, దేశ భవిష్యత్తు దృష్ట్యా ఈ సమస్యను త్వరగా పరిష్కరించాల్సిన అవసరం ఉన్నది. కనీసం కోర్టులైనా కలగజేసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలి. వారిలో భరోసా కల్పించాలి.

మార్పు బాగుండె.. ఏమార్పే మోసం

మేడిపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి
96151 46666

> వలస పాలనలో అత్యంత నిర్లక్ష్యానికి గురై, అన్ని విధాలుగా ఛిద్రమైంది మన తెలంగాణ. అందుకే పోరాటం చేసినం. రాష్ట్రం సాధించుకున్నం. స్వరాష్ట్రం సిద్ధించిందన్న ఆనందం ఓవైపు ఉంటే.. తెలంగాణ వాళ్లకు పాలన చాతనైతదా అంటూ ఓ వర్గం మీడియా రాస్తున్న పచ్చకామెర్ల రాతలను చూసి తన్నుకొస్తున్న నిర్వేదం మరోవైపు తెలంగాణ ప్రజలను వెక్కిరిస్తున్నది.

స్వయంపాలన మనకు చాతనైతదా అని ప్రజల్లోనూ ప్రశ్నలు తలెత్తుతున్న సమయమది. కానీ, ఆ అనుమానాలన్నింటినీ కేసీఆర్ పటాపంచలు చేశారు. అసలు స్వయంపాలన 2014లో మొదలైంది. కానీ, ఈ పాలనకు మేధోమథనం మాత్రం 2001లోనే మొదలైంది. నాడు ఎంతమంది వెక్కిరించినా, ఎంతో మంది అవమానపరిచినా ఓ వైపు ఉద్యమం చేస్తూనే, మరోవైపు స్వయంపాలనలో చేపట్టాల్సిన కార్యాచరణపై కేసీఆర్ అప్పట్లోనే మేధోమథనం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అన్నిటికంటే ముందుగా ఛిద్రమైన రైతన్న బతుకును బాగుచేయాలని, సాగు నీళ్లియ్యాలనే ఆలోచన నుంచి పుట్టిందే మిషన్ కాకతీయ. కాకతీయ, రెడ్డి రాజులు తమ పాలనలో చెరువులు తవ్వించి, రైతులకు సాగునీరందించారు. ఆ స్ఫూర్తితోనే ధ్వంసమైన అనేక చెరువులను కేసీఆర్ పునరుద్ధరించారు. అంతేకాదు, కొత్తగా అనేక చెరువులను తవ్వించారు. చెరువుల అనుసంధానంతో నీళ్లకు నడక నేర్పించారు. తద్వారా సిరుల తెలంగాణను సాకారం చేశారు. అందుకు ప్రత్యక్ష నిదర్శనమే పాలమూరు జిల్లా. చెరువుల పూడికతీత, నూతనంగా నిర్మించిన చెరువులతో పాలమూరు బీడు భూముల్లో సిరులు పండాయి. ఉమ్మడి పాలనలో కరవుకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన పాలమూరు పచ్చని పైట కప్పుకొన్నది. ఇది కదా అసలుసిసలు మార్పు.

ప్రతీ ఇంటికి తాగునీరు అందించాలని, నల్గొండ జిల్లాను దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టాలని కేసీఆర్ సంకల్పించారు. అనుకున్నట్టుగానే ఫ్లోరైడ్ సమస్యకు చరమగీతం పాడారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇచ్చారు. బిందెలు పట్టుకొని కిలోమీటర్ల కొద్దీ నడిచే మహిళల దుస్థితికి ముగింపు పలికారు. వారి ఆత్మగౌరవాన్ని కాపాడారు. ఇది కదా మార్పు.

ఏమార్పు – 6 గ్యారంటీలు
ఏమార్పు – 13 అంశాలు
ఏమార్పు – 420 హామీలు
ఏమార్పు – తొలి క్యాబినెట్‌లో మెగా డీఎస్సీ
ఏమార్పు —2023 డిసెంబర్ 9న రుణమాఫీ
ఏమార్పు – రైతుభరోసా ఇవ్వకపోవడం
ఏమార్పు – నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయలేకపోవడం
ఏమార్పు – ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు
ఏమార్పు – నీటి నిల్వలను కాపాడలేకపోడం.

దశాబ్దాల పాటు సాగివేతలతో ప్రాజెక్టులను నిర్మించే చరిత్ర కాంగ్రెస్‌ది. కాంగ్రెస్ పాలకులు అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టుల పునర్నిర్మాణంతో పాటు కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి వంటి బారీ ప్రాజెక్టులను నిర్మించి 'నా తెలంగాణ కోటి ఎకరాల మాగాణం' అన్న దాశరథి కలను సాకారం చేసిన మార్పు బాగుంది. టీఎస్ఐపాస్ అనే విప్లవాత్మకమైన సంస్కరణలను చేపట్టి ప్రాంరిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టించి, హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసిన మార్పు బాగుంది.

> రైతుబంధు, రైతు బీమా, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, అవ్వతాతలకు పింఛన్లు, కంటివెలుగు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను విజవంతంగా అమలు చేసి దేశానికే దిక్సూచిగా తెలంగాణను నిలిపిన మార్పు బాగుంది.

అభివృద్ధి-సంక్షేమం జోడెద్దుల బండిలాగా పరుగులు పెడుతున్న తరుణంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన ఏమార్పు ప్రజలను నిట్టనిలువునా ముంచింది. ఆరు గ్యారంటీలు, 13 అంశాలు, 420 అలవిగాని హామీలకు తోడు అబద్ధాలు, అర్ధసత్యాలను కాంగ్రెస్ వల్లెవేసింది. ఇష్టారీతిన ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా ఏ ఒక్క హామీని సంపూర్ణంగా అమలు చేయలేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. అంతేకాదు, అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి క్యాబినెట్ భేటీలోనే మెగా డీఎస్సీకి ఆమోదిస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, ఏడాదిలోపే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసింది.

ధర్నాచౌక్‌ను పునఃప్రారంభిస్తూ.. కాంగ్రెస్ పాలనలో ధర్నా చౌక్ అవసరం ఉంటుందని చెప్పకనే చెప్పింది. ఒక్క ధర్నా చౌకే కాదు, ఈ రాష్ట్రమే ఓ ధర్నా చౌక్ అవుతుందని నిరూపించింది. ప్రమాణస్వీకారం చేయకముందే ప్రగతి భవన్ వద్ద ఇనుప కంచెలను తొలగించి హడావుడి చేశారు. ప్రజావాణి పేరిట ముఖ్యమంత్రిని ఎవరైనా, ఎప్పుడైనా కలవొచ్చంటూ ప్రగల్భాలు పలికారు. కానీ, తీరా చూస్తే అది ఆరంభ శూరత్వమేనని ఇప్పుడు తేలిపోయింది.

పాలనలో అనుభవమే లేదు. పాలనను అర్థం చేసుకున్నదే లేదు. నెలకు 20 రోజులు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. ఏడు నెలలైనా ముఖ్య శాఖలకు మంత్రులను కేటాయించకుండా శాంతిభద్రతలకు తిలోదకాలిచ్చి రాష్ట్రాన్ని అగ్గిగుండంలా మారుస్తున్నారు. ఎన్నికల సమయంలో 'ఆ ఇంటి కాకి ఈ ఇంటిపై వాలొద్దు.. ఈ ఇంటి కాకి ఆ ఇంటిపై వాలొద్దు, అలా వాలితే కాల్చిపారేస్తా' అని ప్రగల్భాలు పలికారు. కానీ, నేడు ఆ ఇంట్లోకే పోయి ఆ కాకులను బతిమాలి మరీ పార్టీలో చేర్చుకుంటున్నారు నాటి ఉద్యమ ద్రోహి. ఆయన చెప్పిన మాటలకు ఎంత విలువ ఉందో దీన్నిబట్టే అర్థమవుతున్నది. పట్టుమని పది రోజులు కూడా మాట మ